పశువైద్యాధికారులు కావలెను

- పశువులకు అందని వైద్యం
- కాళ్ల పశు వైద్యశాలలో అన్ని బాధ్యతలూ అటెండర్ వే



జువ్వలపాలెంలో పశువుల ఆసుపత్రి



కాళ్ళ పశువుల ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న దొడ్డనపూడి వెటర్నరీ రవీంద్ర రెడ్డి

కాళ్ల: మండలంలో పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులను వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలో పశు వైద్యశాలల్లో శాఖ వైద్యుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు ఏ అనారోగ్యం వచ్చిన చూసేవారు లేక నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన వైద్యం అందించేవారు లేకపోవడంతో దిక్కు తోచక వెనుతిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. కాళ్ల మండలంలో కాళ్ళ జువ్వలపాలెం గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉన్నాయి. అయితే ఈ రెండు ఆసుపత్రులలోనూ డాక్టర్లు గాని కాంపౌండర్లు గాని ఏ ఒక్కరు లేకపోవడంపై రైతులు పెదవిరుస్తున్నారు. మండల కేంద్రమైన పశు వైద్యశాలలో అయితే అన్ని అటెండ్రే బాధ్యతలు తీసుకోవాల్సిన పరిస్థితి. పెదమిరం కోపల్లె వైద్యశాలల్లో జేఈవో (జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు) మాత్రమే ఉన్నారు. మండలంలో పశువైద్యాధికారులు లేకపోవడంతో ఆకివీడు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన పశు వైద్యాధికారి కాళ్ల మండలంలో వైద్యాధికారిగా ఇంచార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండలంలో సుమారు 9000 పశువులు ఉండగా ఎనిమిది వేల మంది రైతుల కుటుంబాలు పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏ ఆస్పత్రులలోను డాక్టర్లు కాంపౌండర్లు లేకపోవడంతో వివిధ పనులపై పశువులకు రోగాలు సోకిన చూసేవారు లేక రైతులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

వైద్యులు లేక ఇబ్బంది పడుతున్నాం

మండల కేంద్రమైన కాళ్లలో పశు వైద్యులు లేక ఇబ్బందులు పడుతున్నాం. పశువులకు ఏ రోగం వచ్చిన చూసేవారు లేక సతమతమవుతున్నం. మండల కేంద్రంలో వైద్యాధికారి లేకపోవడం దారుణం. వెంటనే వైద్యాధికారిని నియమించాలి. గనిశెట్టి మధుబాబు, కాళ్ళ.

పశువులకు రోగం వస్తే చూసేవారు లేరు

పశువులకు రోగాలు వస్తే చూసే నాథుడు కరువయ్యాడు. ఇంచార్జ్ వైద్యులతో పశువైద్యశాల నడుపుతున్నారు. మండల కేంద్రంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. వైద్యులను ఏర్పాటు చేసి పశువులకు సేవలు అందించాలి. సీహెచ్ సుబ్రమణ్యం, కాళ్ళ

వైద్యుల ఏర్పాటుకు కృషి

కాళ్ల మండలంలో పశువైద్యుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నం. రైతుల ఇబ్బందులు దృష్ట్యా ఉన్నత అధికారులతో చర్చించి వైద్యులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. డాక్టర్ మల్లేశ్వరరావు, ఏడిఏ.

మోసం చంద్రబాబు నైజం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీ సుందర్‌కుమార్

ఉండి: మోసం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గొర్రుముచ్చు సుందర్ కుమార్ అన్నారు. ఆడబిడ్డ నిధి అంటూ ఆడంబరంగా పేరుపెట్టి ఆడపడుచులను మోసగించే దుర్మార్గ బుద్ధి కూటమి నాయకుల సొంతమంటూ గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆడబిడ్డ నిధిగా అందిస్తామని ఇంటింటికీ చెప్పి ఓట్లు దండుకుని ఇప్పుడు పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ దుర్మార్గంగా మాట్లాడటం చూస్తుంటే కూటమి ప్రభుత్వానికి ప్రజల చేతిలో పరాభవం ఎంతో దూరంలో లేదనిపిస్తుందని మండిపడ్డారు. అధికారం కోసం ఎంతటి వాగ్దానమైనా చేసేయడం అధికారంలోకి రాగానే అమలు చేయలేమేమో అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని అన్నారు. గతంలో అధికారం చేపట్టిన సమయంలో ఎప్పుడూ చేసిన వాగ్దానాలు అమలు చేసిన చరిత్ర చంద్రబాబుకు లేదన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చాలంటే అది మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే సాధ్యమవుతుందని రాజకీయాలకు అతీతంగా ప్రజలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఒక్కసారి మాత్రమే ముఖ్యమంత్రిగా చేసిన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపోయారని అన్నారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసినా చంద్రబాబు మాత్రం రాజకీయ నాయకుడుగానే మిగిలిపోయారని విమర్శించారు. ఇప్పుడైనా ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటినీ వెంటనే అమలు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మండిపడ్డారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ కక్షపూరితం



కుముదవల్లిలో మాట్లాడుతున్న గంటా సుందర్ కుమార్

పాలకోడేరు: వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు కక్షపూరితమని, కూటమి ప్రభుత్వ అన్యాయాలను, అక్రమాలను నిలదీస్తున్నందునే అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపారని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ అన్నారు. దళిత ఐక్యవేదిక పాలకోడేరు మండలం శాఖ సమావేశం గురువారం కుముదవల్లి గ్రామంలో జరిగింది. ఈ సమావేశానికి దళిత నాయకుడు కొండేటి లాజర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో గంట సుందర్ కుమార్ మాట్లాడుతూ మూడు సార్లు ఎంపీగా గెలిచి ప్రజాసేవ చేస్తున్న మిథున్ రెడ్డిని మద్యం కేసులో ఇరికించారని మండిపడ్డారు. ఈ బురదను జగన్‌మోహన్‌రెడ్డికి సైతం అంటగట్టే విధంగా కూటమి నేతలు అన్ని రకాల కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు, అతని కోటరీ ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడం కొత్తేమీ కాదన్నారు. అధికారంలోకి వచ్చేందుకు కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలు గురించి ఇటీవల టీడీపీ నిర్వహించిన ముందడుగు కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు హామీలు అమలు చేయాలని నిలదీస్తుండటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి ఎత్తులు వేస్తున్నారని సుందర్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో చిలకంపూడి ప్రకాష్, కురుకుంటి పాల్, గండి చిట్టిబాబు, కుసుమే వెంకటరావు, దొడ్డి యోహాను పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన



మోగల్లులో పర్యటిస్తున్న సర్వేక్షణ్ కేంద్ర బృందం

పాలకోడేరు: మండలంలోని మోగల్లు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయాలు, స్కూల్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య పరిస్థితి, మురుగునీరు పారుదల, పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం మధుమతి గ్రామంలో వ్యక్తిగత గృహాలను ర్యాండంగా పరిశీలించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉన్నది లేనిది, ఆ ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో ఏమైనా కూరగాయలు పండ్లు పెంచుతున్నారా లేదా అనే అంశాలను కేంద్ర సర్వర్‌తో స్వయంగా సర్వే చేయించారు. వాటితోపాటు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చేస్తున్న చెత్త విడదీయడం, ప్లాస్టిక్ గ్లాస్ తదితర వ్యర్థాలను వేరు చేయడం, వర్మీ తయారు చేయడం, తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు జి.రవి కిరణ్, ఎంపీడీవో వి. రెడ్డియ్య, పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎంవీఎస్ రాంప్రసాద్, సంతోష్, పంచాయతీ కార్యదర్శి ఓ సుజాత, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య, సునంద, ఇందు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళులు



అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: కేరళ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు వీఎస్ అచ్యుతానందన్‌కు సీపీఎం కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కార్యదర్శి తవిటి నాయుడు మాట్లాడుతూ చివరి శ్వాస వరకు పార్టీ అభివృద్ధి, ఆశయాలకు పనిచేశారన్నారు. ఎన్నో ప్రజా పోరాటాల్లో కీలక భూమిక పోషించిన అచ్యుతానందం మరణించడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్యుతానందన్ ఆశయ సాధనకు నేటి కమ్యూనిస్టులంతా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ కె వలి, డోకల రవితేజ, బి. వి.వర్మ, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, గేదెల రాము,పాలేపు రమణమ్మ, సొర్ల రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ సీఈవో నందమూరి సుబ్బారావు

భీమవరం అర్బన్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడేరు సొసైటీ సీఈవో నందమూరి సుబ్బారావు రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని తాడేరులో సహకార పరపతి సంఘంలో బుధవారం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి సుబ్బారావు మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15లోపు పంటల బీమా పథకానికి ప్రీమియం ఎకరానికి రూ. 210 చెల్లించాలన్నారు. ఇలా చేయడం ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోయినప్పుడు నష్ట పరిహారం చెల్లిస్తారన్నారు. కౌలు రైతులు, రుణాలు తీసుకోని రైతులకి కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ హశ్వంత్, తాడేరు, బేతపూడి రైతులు పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణ వాసులకు అవార్డులు



అవార్డులు అందుకున్న పాలకొల్లు సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన కళాకారులు, సేవా సంస్థ సభ్యుల్లో పలువురు కోడి రామకృష్ణ కళా, సేవా రంగ అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ల్యాబ్‌లో బుధవారం ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో శతచిత్రాల దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన తెలుగు సరస్వతి పరిషత్ జాతీయ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, రంగస్థల నటుడు, వైద్య సేవకుడు గుడాల హరిబాబు, శ్రీ కృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, సాహితీ సాంస్కృతిక రంగాల సేవకుడు యర్రంశెట్టి వెంకటరత్నం, రక్తదాన స్ఫూర్తి ప్రదాత ధనానీ సూర్యప్రకాష్‌లు తమ రంగాల్లో అవార్డులను అందుకున్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం





రాయనివానిగూడెంలో కాలువ పూడికతీసి రోడ్డుపై మట్టివేసిన దృశ్యాలు

- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

ఉండి: రైతులకు సాగునీరందించేందుకు గత వేసవిలో కాలువలు, డ్రైయిన్‌ల పూడిక తీత పనులను అధికారులు చేపట్టారు. దీనివల్ల రైతులకు కొంత మేలు జరిగినా ప్రజలకు మాత్రం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే వేసవిలో మండలంలోని పలు పంటకాలువలు, డ్రైయిన్‌లలో పూడికతీత పనులు చేపట్టారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌లు మాత్రం ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేశారు. కాలువలు, డ్రైయిన్‌లలో తీసిన పూడిక మట్టి కాలువగట్లు, రహదారులపై వేసి నిర్లక్ష్యంగా వాటిని విడిచి పెట్టేయడంతో ప్రజలతో పాటు వాహనదారులు కూడా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ప్రతిఘటించడంతో అధికారులు మట్టిని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే మరికొన్ని ప్రాంతాల్లో మట్టి రోడ్లు, ఇళ్ల ముందు ఇప్పటికీ అలాగే ఉండిపోయింది. దీనివల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్లపైకి రావడం, ఇంటి గుమ్మాల ముందుకు చేరుకోవడంతో పరిస్థితులు అధ్వానంగా మారిపోయాయి. సుమారు రెండు నెలల క్రితం యండగండి గ్రామ శివారు రాయనివానిగూడెం ప్రాంతంలో యండగండి, కోలమూరు కాలువలో పూడిక తీశారు. అయితే మట్టిని మాత్రం ఆర్‌అండ్‌బీ రోడ్డుపైనే వేశారు. దీని వల్ల ఎంతో మంది స్థానికులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడ్డారు.అయినా అధికారులు స్పందించక పోవడంతో కొందరు స్వచ్ఛందంగా ఖర్చుపెట్టుకుని తమ ఇళ్ల ముందు ఉన్న మట్టిని తొలగించుకున్నారు. అయితే రాయనివానిగూడెం వంతెన వద్ద ఇప్పటికీ మట్టి తొలగించకపోవడంతో రోడ్డుపైనే భారీగా నీరు నిలచి ప్రమాదాలకు నిలయంగా మారిపోయింది. రహదారిపై మట్టి వేయడమే కాకుండా దానిని తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అధికారులు, ప్రజాప్రతినిధులకు తగదని స్థానికులు వాపోతున్నారు.

రేషన్ పంపిణీ పారదర్శకంగా ఉండాలి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి

పాలకోడేరు: కార్డుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి అన్నారు. మండల రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన రేషన్ డీలర్లకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి 65 సంవత్సరములపై బడిన వారికి, వికలాంగులకు, మంచం పైనే ఉన్న రోగులకు ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయాలని తెలిపారు. స్టాక్ విషయంలో తేడాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. రేషన్ పంపిణీలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్డు దారులకు రేషన్ షాపు దూరంగా ఉంటే రెండవ పాయింట్‌కు అనుమతి తీసుకుని వారికి ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ నెలలో మూడు షాపులకు అనుమతి ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ఆది శేషయ్య, మండల రేషన్ డీలర్స్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, సెక్రెటరీ సోము సాయి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చినబాబు కోశాధికారి కొల్లా సత్యనారాయణ, సాంబ్రాణీపద్మజ, నవీన్, ఉషారాణి కె.వి నాగలక్ష్మి, అరుణ, కుమార్, ఎం.వి సత్యనారాయణ, సోము అన్నపూర్ణ, కడిమి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీపురం- మార్టేరు రోడ్డు నిర్మాణం ఎప్పుడో?

- ప్రజల ఎదురుచూపు
- రాకపోకలకు ఇబ్బందులు



పెనుగొండ కాలువగట్టు నుంచి బాపూజీపురం రహదారి దుస్థితి

పెనుగొండ: ఎన్నో ఏళ్లుగా తీరని కలగా పెనుగొండ మార్టేరు కాలువ గట్టు రహదారి పరిసర ప్రాంతాల ప్రజలు నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. నర్సాపురం ప్రధాన కాలువ గట్టు బాపూజీపురం నుంచి మార్టేరు వరకు సుమారు మూడు కిలో మీటర్లకు పైగా రహదారి పుంత గట్టును తలపిస్తుంది. పెనుగొండలో పెద్ద వంతెన నుంచి బాపూజీపురం వరకు, తిరిగి పెనుగొండ పెద్ద వంతెన నుంచి మార్టేరు వరకు రహదారి ఉంటుంది. ఇందులో పెద్ద వంతెన నుంచి బాపూజీపురం వరకు రహదారి నిర్మాణంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్నోసార్లు వినతులు అందించారు. అయినా, ఫలితంలేదు. పెద్ద వంతెన నుంచి మార్టేరు రహదారిలో వంతెన నుంచి కళాశాల శాంతి నగర్ వరకు సీసీ రోడ్డు నిర్మించారు. అక్కడ నుంచి మార్టేరు వరకు గత 15 ఏళ్ల క్రితం ఎర్ర గ్రావెల్‌తో రహదారి నిర్మించారు. ఐతే, నర్సాపురం ప్రధాన కాలువ ఆధునికీకరణతో రహదారి పూర్తిగా పాడైపోయి, కాలువ మట్టితో నిండిపోయింది. రహదారి మొత్తం పుంత రోడ్డును తలపించే విధంగా మారి పోయింది. అప్పటి నుంచి ప్రజలు నానావస్థలకు గురవుతున్నారు. రహదారి బాగున్నపుడు శాంతినగర్‌లో ఉన్న కళాశాలకు మార్టేరు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు కాలువ గట్టు రహదారిపైనే వచ్చే వారు. రహదారి చిట్టడవిని తలపిస్తూ పుంతరోడ్డులా ఉండడంతో పడుతూ లేస్తూ రాలేక ప్రధాన రహదారిపై వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిలో సత్యవరం, నెగ్గిపూడి, వనంపల్లిలకు చెందిన ప్రజలు పెనుగొండ రావడానికి సులభంగా ఉంటుంది. దీంతో రహదారి నిర్మాణం ప్రాముఖ్యత నెలకొంది. ఇదేవిధంగా బాపూజీపురం ప్రజలు సైతం వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు రాకపోవడంతో కాలినడక వంతెనపై మోసుకొంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతుల సాగు భూములు నుంచి పంటను మిల్లులు చేర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో ఆదిలక్ష్మి అమ్మవారు



శాకంబరి అలంకరణలో ఆదిలక్ష్మి అమ్మవారు

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీ ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం నందు అమ్మవార్లకు శాకంబరి అలంకరణలో ప్రత్యేక పూజలు చేశారు. యామిజాల లక్ష్మి నరసింహమూర్తి కుటుంబ సభ్యులు అమావాస్య పూజ నిర్వహించి, వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణాధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు పర్యవేక్షించారు.

ఘనంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు వేదపండితులు చండీహోమం నిర్వహించారు. సుమారు 72 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

స్మార్ట్ మీటర్లపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): స్మార్ట్ మీటర్ల వలన నష్టం లేకపోతే ప్రజల్లోకి వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహల అవసరం లేదని వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీలు భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ రఘునాథ బాబు ప్రకటించడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే బలవంతంగా బిగించిన స్మార్ట్ మీటర్ల వలన అదనపు చార్జీలు రావడంతో అనేక సంస్థలు, వ్యాపారదారులు, ప్రజలు గగ్గోలు పెడుతున్నారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం బాగానే పనిచేస్తున్న మీటర్లను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలందరూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

నేటి నుంచి శ్రావణ శుక్రవారం పూజలు

యలమంచిలి: శ్రావణ మాసం సందర్భంగా అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఈ నెల 25 శుక్రవారం నుంచి వచ్చే ఐదు శుక్రవారాలు కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు ఆగమ ప్రవర సుదర్శనం శ్రీనివాసచార్యులు బ్రహ్మత్వంలో ఈ పూజలు, ఆఖరి శుక్రవారం (ఆగష్టు 22) సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో మహిళలంతా పాల్గొన్ని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గోరింటాకు పండుగ

యలమంచిలి: ఆషాఢ మాసం చివరి రోజు సందర్భంగా గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో బుధవారం రాత్రి మాతా శక్తి మహిళలు గోరింటాకు పండుగ నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్, మాతా శక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మాతా శక్తి ప్రాంత సంయోజిత తొట్టెంపూడి సునీత దేవి, మండల విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి అప్పన రాంబాబు, మండల బజరంగదళ్ సురక్ష ప్రముఖ్ చెరుకూరి శేషగిరి, సుంకరపాలెం మాతా శక్తి మహిళలు వీరా విద్యాదేవి, బోనం సాయి కళ, పెంటపాటి కనకదుర్గ, బోనం అనంతలక్ష్మి, వీరా అశ్విని, కఠారి నాగ లక్ష్మీ దుర్గ, బజరంగ్ దళ్ కార్యకర్తలు దివి ప్రకాష్, బొలిశెట్టి శివ సూర్య, పడాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూతన ఏడీఏను కలసిన సిబ్బంది



ఏడీఏ మురళీ కృష్ణను కలిసిన ఆచంట వ్యవసాయ సిబ్బంది

పెనుగొండ: సహాయ వ్యవసాయ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన మురళీ కృష్ణను ఆచంట మండల వ్యవసాయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. ఆయన తాడేపల్లిగూడెం నుంచి బదిలీపై పాలకొల్లు ఏడీఏగా నియమితులయ్యారు. మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది గురువారం ఆయన్ని కలిశారు. అనంతరం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని 132/33 కేవీ భీమవరం, జీఐఎస్, టీడ్కో విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల నిమిత్తము శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్, నరసయ్య అగ్రహారం, కొడవల్లి రోడ్డు, మార్కెట్ యార్డ్ ఏరియా, హౌసింగ్ బోర్డు కాలనీ, చినరంగనిపాలెం, కలెక్టర్ ఆఫీస్ ఏరియా, మారుతి నగర్, బస్టాండ్ ఏరియా, బుధవార్ మార్కెట్, కళాభవన్ వీధి, మెంటే వారి తోట, శ్రీనివాస్ సెంటర్, కామాక్ష్మ గుడి ఏరియా, ముస్లిం స్ట్రీట్, మంచువారి సెంటర్, తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చినబంగార్రాజును పరామర్శించిన చినమిల్లి



బంగార్రాజును పరామర్శిస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

భీమవరం అర్బన్: మండలంలోని వెంప గ్రామంలో మాతృ వియోగంతో బాధపడుతున్న కలిదిండి చిన బంగార్రాజును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకట్రాయుడు గురువారం పరామర్శించారు. ఇటీవల కలిదిండి చినబంగర్రాజు తల్లి అప్పల నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. చినబంగార్రాజును పరామర్శించి అధైర్య పడ వద్దని మేమంతా అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నరసాపురంలో వదలని వాన

నరసాపురం: నరసాపురంలో గత మూడు రోజులుగా స్వల్ప స్థాయి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతోంది. గురువారం ఉదయం నుంచి వర్షంపడింది. మంగళవారం నుంచి వాతావరణంలో మార్పు మొదలైంది. ముసురుపట్టి వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందన్నారు.